క్లుప్తంగా

నేడు ఉచిత వైద్య శిబిరం

గంగాధరనెల్లూరు: మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఆదివారం కర్ణాటక రాష్ట్రం బెంగళూరు నగరానికి చెందిన వైదేహి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైట్‌ఫీల్డ్ వారి సహకారంతోపాటు బిగ్ టీవీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్యాన్సర్, గుండె, కిడ్నీ, షుగర్, గ్యాస్ట్రోఎంట్రాలజీ, న్యూరాలజీ సంబంధిత వ్యాధులకు పరీక్షలు చేసి, ఉచిత వైద్యం అందిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమం ఆదివారం 10 గంటల నుండి మధ్యాహ్నం 2.30 వరకు జరుగుతుందని, అర్హులైన వారికి ఎన్టీఆర్ వైద్యసేవ స్కీం ద్వారా ఉచిత ఆపరేషన్లు చేయించనున్నట్లు తెలిపారు. సమాచారం కోసం హాస్పిటల్ కోఆర్డినేటర్ నాగబాల లోకేష్ రాయల్- 99895 93952, జయచంద్ర నాయుడు-9912122337 సంప్రదించగలరని పేర్కొన్నారు.

వృద్ధులతో ఆప్యాయంగా మెలగాలి


భోజనాలు వడ్డిస్తున్న ఉమాశంకర్ దంపతులు

కార్వేటినగరం: వృద్ధులపై ప్రతి ఒక్కరూ ప్రేమ, ఆప్యాయతను కలిగి ఉండాలని ఆర్కేఎస్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు ఉమాశంకర్ అన్నారు. శనివారం మేజర్ పంచాయతీ కార్వేటినగరం వృద్ధాశ్రమంలో ఉమాశంకర్, సరళాదేవి దంపతుల వివాహ దినోత్సవం సందర్భంగా భోజన వసతి కల్పించారు. పండ్లు, స్వీట్లు పంచిపెట్టారు. వృద్ధాశ్రమంలోని వృద్ధులు ఉమాశంకర్ దంపతులను శాలువా కప్పి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో రాస్ కో–ఆర్డినేటర్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు అవార్డు


అవార్డు అందుకుంటున్న డాక్టర్ శ్రీవిద్య

శ్రీరంగరాజపురం: మండల పశువైద్యాధికారి డాక్టర్ శ్రీవిద్య జిల్లా ఉత్తమ సేవ అవార్డును జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ చేతుల మీదుగా అందుకున్నారు. అవార్డు అందుకోవడంతో తనకు మరింత బాధ్యత పెరిగిందని ఆమె తెలిపారు. పాడి రైతులకు మరింత మెరుగైన సేవలు అందిస్తానన్నారు.

ఉత్తమ సూపర్‌వైజర్‌గా రోజారమణి


అవార్డు అందుకొంటున్న రోజారమణి

వడమాలపేట (విజయపురం): అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా వడమాలపేట మండల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రోజారమణి ఉత్తమ సూపర్‌వైజర్ అవార్డు అందుకొన్నారు. శనివారం తిరుపతి తుడా కార్యాలయంలో జరిగిన మహిళ దినోత్సవ వేడకల్లో భాగంగా జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఈ అవార్డు అందజేశారు. పుత్తూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు కింద ఆధార్ నమోదు కార్యక్రమంలో ఆమె అందించిన సేవలకు ఈ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా పుత్తూరు ప్రాజెక్టు సిబ్బంది ఆమెకు అభినందనలు తెలిపారు.

సీడీపీఓ వినుతశ్రీకి అవార్డు


అవార్డులు అందుకుంటున్న ఐసీడీఎస్ సిబ్బంది

గంగాధరనెల్లూరు: అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా గంగాధరనెల్లూరు ఐసీడీఎస్ సీడీపీఓ వినుతశ్రీ కలెక్టర్ సుమిత్ కుమార్ చేతుల మీదుగా ఉత్తమ అవార్డు అందుకున్నారు. ఉత్తమ సూపర్‌వైజర్‌గా అనురాధ, జీడీనెల్లూరు దళితవాడకు చెందిన గోవిందమ్మ ఉత్తమ అంగన్‌వాడీ టీచర్‌గా, పెనుమూరు మండలానికి చెందిన హెల్పర్ తనూజ ఉత్తమ అవార్డులు అందుకున్నారు.

అపరిశుభ్రంగా బస్టాండు


అపరిశుభ్రంగా ఉన్న వడమాలపేట బస్టాండు

వడమాలపేట(విజయపురం): మండల కేంద్రం వడమాలపేట బస్టాండు అపరిశుభ్రంగా ఉంది. బస్టాండు ఆవరణలో చెత్తాచెదారం దర్శన మిస్తున్నాయి. పక్కన ఉన్న అంబేడ్కర్ విగ్రహం చుట్టూ ఉన్న కమ్మీలపై బట్టలు ఆరబెట్టడం చూసి చుట్టుపక్కలవారు మండిపడుతున్నారు. అధికారులు స్పందించి బస్టాండుతోపాటు అంబేడ్కర్ విగ్రహం చుట్టూ పారిశుధ్య పనులు చేపట్టాలని కోరుతున్నారు.

మహిళను గౌరవించడం సంస్కృతిలో భాగం

నగరి: మహిళను గౌరవించడం మన సంస్కృతిలోనే ఉందని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అన్నారు. శనివారం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో మెప్మా, ఐసీడీఎస్ ప్రాజెక్టు వారు సంయుక్తంగా నిర్వహించిన వేడుకలలో ఆయన పాల్గొన్నారు. మహిళా దినోత్సవ కేక్‌ను కత్తిరించి మహిళలకు అందించారు. సీడీపీఓ కృష్ణవేణి, ఎంఈఓ శ్రీదేవి, అంగన్‌వాడీ వర్కర్లు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

ఉన్నతానికి ఎసరు

గత ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి తీసుకొన్న నిర్ణయాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేవి. కానీ కూటమి ప్రభుత్వ పాఠశాల విద్యకు తూట్లు పొడిచి పేద విద్యార్థులకు అన్యాయం చేసేలా నిర్ణయాలు తీసుకుంటోంది. ఇప్పటికే 117 జీఓను రద్దు చేసింది. తాజాగా ప్రాథమికోన్నత పాఠశాలల్లో 6, 7, 8 తరగతి విద్యార్థులను జెడ్పీ పాఠశాలలకు తరలించడానికి సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా విద్యాశాఖ అధికారులు సర్వే చేయడంతో వడమాలపేట మండలంలోని ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు.

- ప్రాథమికోన్నత పాఠశాలల కుదింపు
- పాఠశాలలను కుదించొద్దు
- ప్రాథమికోన్నత పాఠశాలగానే కొనసాగించాలి
- తిరుమణ్యం గ్రామస్తుల వేడుకోలు


తిరుమణ్యం ప్రాథమికోన్నత పాఠశాల, వేమాపురం రైల్వే బ్రిడ్జి కింద నిలిచి ఉన్న వర్షపు నీరు (ఫైల్)

వడమాలపేట(విజయపురం): వడమాలపేట మండలంలో మొత్తం 42 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. అందులో జెడ్పీ పాఠశాలలు 6, ప్రాథమికోన్నత పాఠశాలలు 5 ఉన్నాయి. ఎస్‌వీపురం, కాయం, పాదిరేడు, తిరుమణ్యం, టీసీ అగ్రహారంలో ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. ఇందులో సుమారు 160 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు.

ప్రాథమికోన్నత పాఠశాలలను కుదించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు సాగిస్తోంది. దీనికి సంబంధించి ఇప్పటికే విద్యాశాఖ అధికారులు సర్వే చేసి నివేదిక పంపేశారు. దీంతో విద్యార్థులతోపాటు తలిదండ్రులకు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మరింత దూరాభారం

ప్రాథమికోన్నత పాఠశాలలను కుదించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు విద్యార్థులకు శాపంగా మారాయి. సర్కారు తీసుకున్న నిర్ణయంతో పాదిరేడు, టీసీ అగ్రహారం, తిరుమణ్యం సమీపంలో ఎక్కడా హైస్కూళ్లు లేవు. దీంతో సుమారు 5 నుంచి 8 కి.మీ దూరంలో ఉన్న వడమాలపేట హైస్కూల్‌కి తరలించారు. తిరుమణ్యం, వడమాలపేట మధ్యలో వేమాపురం వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి ఉంది. చిన్నపాటి వర్షం పడినా బ్రిడ్జి కింద నీరు నిలిచిపోతుంది. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉంటుంది. బస్సు సౌకర్యం లేదు. ప్రతి రోజు ఆటోలో రావాలి. అలాగే టీసీ అగ్రహారం, పాదిరేడు విద్యార్థులు వడమాలపేట రావాలంటే చెన్నై–తిరుపతి జాతీయ రహదారి దాటల్సి ఉంది. ప్రస్తుతం ఆ మార్గ మధ్యలో తరచూ ప్రమాదాలు జరుగుతూ ఉండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రాథమికోన్నత పాఠశాలను కొనసాగించాలి



మండలంలోని ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలను అలాగే కొనసాగించాలి. తిరుమణ్యం నుంచి వడమాలపేటకు బస్సు లేవు. ప్రతి రోజు ఆటోలో వెళ్లాలంటే పిల్లలకు కష్టం. వేమాపురం మార్గ మధ్యలో రైల్వే అండర్ బ్రిడ్జి ఉండడంతో వర్షకాలంలో ఆటోలు కూడా రావు. అధికారులు, పాలకులు ఆలోచించి పాఠశాలను కొనసాగించాలి.

– దినేష్, తిరుమణ్యం, వడమాలపేట మండలం

నివేదిక పంపేశాం

ఇటీవల సర్వే చేసి ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే ఎస్‌వీపురం తప్ప మిగిలిన ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులను సమీపంలోని హైస్కూల్‌కి తరలిస్తాం. తల్లిదండ్రులు, ఎస్ఎంసీ సభ్యుల తీర్మానాల ను ఉన్నాధికారులకు తెలియజేశాం.

– తులసిరాం, ఎంఈవో–2, వడమాలపేట మండలం

గణేశునికి పట్టువస్త్రాల సమర్పణ


పట్టువస్త్రాలు తీసుకువస్తున్న విజయానందరెడ్డి

శ్రీరంగరాజపురం: శ్రీవినాయక స్వామి ఆలయ మహా కుంభాభిషేకం మండలంలోని శివగంగపురం గ్రామంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ సీపీ చిత్తూరు నియోజకవర్గం ఇన్‌చార్జ్ విజయానందరెడ్డి స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ సిబ్బంది విజయానందరెడ్డికి ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేసి, స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. పలు సాంస్కతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. స్వామివారిని ఊరేగించారు. సర్పంచ్ మార్కొండయ్య, వైస్ ఎంపీపీ చంద్రయ్య నాయుడు, ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు గురవారెడ్డి, మండల అధ్యక్షుడు మణి, మాజీ సర్పంచ్ మణి, సుధ, యుగంధర్, గోపి, పట్టాభి, అనంతరెడ్డి, శేషాద్రి, కుప్పయ్య, జనార్ధన్, కాలప్ప, మణి, గండు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ సీపీలోనే మహిళలకు గౌరవం


సన్మాన గ్రహీతలైన మహిళా ప్రజాప్రతినిధులతో వైఎస్ఆర్ సీపీ నేతలు


మహిళా దినోత్సవ కేక్ కత్తిరిస్తున్న మహిళా ప్రజాప్రతినిధులు


ఎంపీపీ లతను సన్మానిస్తున్న ఎంపీడీఓ చంద్రమౌళి, సీడీపీఓ పద్మసునంద

నగరి: మహిళలకు గౌరవం వైఎస్ఆర్ కాంగ్రెస్‌లోనే దక్కిందని ఆ పార్టీకి చెందిన మహిళా ప్రజాప్రతినిధులు అన్నారు. శనివారం మాజీ మంత్రి ఆర్కే రోజా ఆదేశాల మేరకు ఆమె నివాస కార్యాలయం వద్ద పార్టీ నేతలు మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా ప్రజాప్రతినిధులను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. మహిళా దినోత్సవ కేక్‌ను కత్తిరించి అందరికీ పంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పథకాన్ని మహిళ పేరిట మహిళలకు అందేలా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారన్నారు. కూటమి ప్రభుత్వం మహిళాదినోత్సవ కానుకగా మోసాన్ని వారికి గిఫ్ట్‌గా అందించిందన్నారు. ఈ కార్యక్రమంలో నగరి, నింద్ర, పుత్తూరు ఎంపీపీలు భార్గవి, దీప, మునివేలు, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు అముద, రాష్ట్ర సాహిత్య అకాడమి మాజీ డైరెక్టర్ జయశ్రీ, మహిళా నేతలు జ్యోతి, వరలక్ష్మి, తేన్‌మొళి, నియోజకవర్గంలోని మున్సిపల్ చైర్మన్లు, వైస్‌చైర్మన్‌లు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కోఆప్షన్ సభ్యులు, రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు మహారాణులు

కార్వేటినగరం: పురుషులకు దీటుగా మహిళలు అన్ని రంగాల్లోనూ రాణిస్తూ మహారాణులుగా వెలుగొందుతున్నారని ఎంపీడీఓ చంద్రమౌళి అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో అంగన్‌వాడీ సిబ్బంది ఎంపీపీ లత ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ లత మాట్లాడుతూ పురుషుల విజయం వెనుక మహిళల కృషి ఎంతో ఉంటుందన్నారు. మహిళలకున్న చట్టాలపై అవగాహన తెచ్చుకుని బాల్య వివాహాలను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎంపీపీ లతను ఎంపీడీఓ చంద్రమౌళి, ఐసీడీఎస్ సీడీపీఓ పద్మసునంద శాలువాలు కప్పి, జ్ఞాపికలను అందించారు. పర్యవేక్షకులు ఇందిరా, శామిని, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు మమత తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అభివృద్ధి పథంలో నడవాలి

నగరి: వివక్ష లేకుండా మహిళలు అభివృద్ధి పథంలో నడవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య అన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక సీపీఐ కార్యాలయంలో పట్టణ కార్యదర్శి శ్యామల అధ్యక్షతన నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ వివక్షతో మహిళలను చులకనగా చూస్తున్నారన్నారు. అవిలేని రోజు మహిళలు ఇంకా అభివృద్ధి చెందుతారన్నారు. ఏఐటీయూసీ నాయకులు సుజాత, చందామర్రై, సలీనా, ఉషారాణి, వెంకటమ్మ, నగోమి, వసంత, మహిళా కార్మికులు పాల్గొన్నారు.

శ్మశానం భూమి కబ్జా


కబ్జాకు గురైన శ్మశానం భూమి


సర్వే నెంబర్ 14లో శ్మశానం పొరంబోకు ఉన్న రికార్డు

వడమాలపేట (విజయపురం): వడమాలపేట మండలం లక్ష్మమ్మకండ్రిగ గ్రామానికి చెందిన శ్మశానాన్ని రైతులు కబ్జా చేసి తన పొలంలో కలిపేసుకున్నారు. పదేళ్లుగా గ్రామస్తులు న్యాయం పోరాటం చేస్తున్నా రెవెన్యూ అధికారులు ఏ మాత్రం పట్టించుకోలేదు. వడమాలపేట మండలం శ్రీనివాసపురం లెక్క దాఖల సర్వే నెంబర్ 14లో 2.57 ఎకరాల శ్మశానం పొరంబోకు స్థలం ఉంది. శ్మశానం చుట్టూ ఉన్న కొందరు రైతులు కబ్జా చేసుకొని తన పొలంలో కలిపేసుకొని సాగు చేసుకొంటున్నారని స్థానికులు వాపోతున్నారు. దీంతో శ్మశానానికి దారి లేక, మృతదేహాలకు అంత్యక్రియలు చేయడానికి స్థలం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఆక్రమణకు గురైన శ్మశానాన్ని స్వాధీనం చేసుకుని చుట్టు కంచె ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ప్రజా ప్రతినిధులకు కనీస గౌరవం లేదు


పీఆర్ ఏఈని నిలదీస్తున్న జెడ్పీటీసీ సుకుమార్

వెదురుకుప్పం: ప్రజా ప్రతినధులకు కనీస గౌరవం ఇవ్వడం లేదని జెడ్పీటీసీ సుకుమార్ ధ్వజమెత్తారు. గతంలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన సిమెంటు రోడ్డు పనుల్లో సర్పంచ్‌ల ప్రమేయం లేకనే పనులు చేపట్టి అవమానించినట్లు చెప్పారు. శనివారం వెదురుకుప్పంలో మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ నాగరాణి అధ్యక్షతన నిర్వహించారు. సభ్యులు పలు సమస్యలపై అధికారులను నిలదీశారు. పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పనుల్లో 25 గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌ల రిజల్యూషన్ లేకుండా ఎందుకు చేపట్టారని పీఆర్ ఏఈ మధుని ప్రశ్నించారు. మినీ గోకులం షెడ్ల మంజూరులో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించినట్లు దేవరగుడిపల్లె సర్పంచ్ ఆశీర్వాదం ఆరోపించారు. అనంతరం ఎంపీపీ నాగరాణి మాట్లాడుతూ గ్రామాల్లో చేతి బోర్ల మరమ్మతులపై దృష్టి పెట్టాలన్నారు. గ్రామాల్లో తాగు నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీఓ అమర్‌నాథ్, ఎంపీటీసీలు రమణ, హరి, మునిచంద్రారెడ్డి, భాస్కర్, కో–ఆప్షన్ సభ్యుడు వెంకటేష్, డీటీ కోమల, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌కు విశేష స్పందన


పుత్తూరులో కేసులను పరిష్కరిస్తున్న జడ్జి రాఘవేంద్ర


కోర్టు హాలులో ఒక్కటైన దంపతులు


లోకఢాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న జడ్జి

నగరి: జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా శనివారం నగరి జూనియర్ సివిల్ మెజిస్ట్రేట్ కోర్టులో నిర్వహించిన లోక్ అదాలత్‌కు విశేష స్పందన లభించింది. 184 కేసులను జడ్జి గోపాలకృష్ణ పరిష్కరించారు. వీటిలో 6 సివిల్ కేసులు, 39 క్రిమినల్ కేసులు, ఒక డీవీసీ కేసు, ఏడు ఎంసీ కేసులు, 9 బ్యాంకు కేసులు, 122 ఎస్‌టీసీ సెకండ్ క్లాస్ కేసులు ఉన్నాయి. వీటి పరిష్కారం ద్వారా కక్షిదారులకు రూ.86.79 లక్షలు పరిహారం లభించనున్నట్లు కోర్టు సిబ్బంది ప్రకటించారు.

పుత్తూరులో 807 కేసులు పరిష్కారం

పుత్తూరు: స్థానిక సబ్ కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 807 కేసులను పరిష్కరించినట్లు సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు ఎస్.సి. రాఘవేంద్ర తెలిపారు. కక్షిదారుల మధ్య రూ.2,74,68,934 రాజీ చేసినట్లు పేర్కొన్నారు. 760 క్రిమినల్ కేసులు, 43 సివిల్, 4 ప్రీ లిటిగేషన్ కేసులను పరిష్కరించినట్లు వివరించారు. లోక్‌అదాలత్‌లో విడాకుల కోసం వచ్చిన కళ్యాణపురానికి చెందిన దంపతులు గురుచరణ్, పద్మప్రియలకు కౌన్సెలింగ్ ఇచ్చి కోర్టు హాలులో మళ్లీ పూలదండలు వేయించి ఒక్కటి చేశారు. లోక్ అదాలత్ ప్రిసీడింగ్ ఆఫీసర్లుగా సీనియర్ సివిల్ జడ్జి ఎస్.సి.రాఘవేంద్ర, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సి.జానకి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వి.గోపాలకృష్ణ వ్యవహరించారు. కార్యక్రమంలో పోలీసులు, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ



బహుమతి అందుకుంటున్న విద్యార్థిని కయల్‌విజి

పాలసముద్రం: గణితం, సైన్స్ ఒలంపియాడ్‌పై శనివారం జరిగిన పరీక్షల్లో తిరుమలరాజుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. జిల్లాలో తృతీయ బహుమతి తీసుకున్నారని హెచ్‌ఎం సుధాకర్ తెలిపారు. సుధాకర్ మాట్లాడుతూ చిత్తూరు లిటిల్‌ఫ్లవర్ స్కూల్లో 6, 7, 8, 9వ తరగతి గణితం, సైన్స్ ఒలింపియాడ్ జరిగిన పరీక్షలో తిరుమలరాజుపురం హైస్కూల్ చెందిన 7వ తరగతి విద్యార్థి కె.కయల్‌విజి తృతీయ బహుమతి గెలుచుకుంది. 9వ తరగతికి చెందిన తేజస్‌వర్మ తృతీయ బహుమతి గెలుచుకున్నారని ఆయన తెలిపారు.

ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌కు అవార్డు


అవార్డు అందుకుంటున్న అనురాధ

పాలసముద్రం: ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనురాధ జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ చేతుల మీదుగా ఉత్తమ అవార్డు తీసుకున్నారు. శనివారం చిత్తూరులో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆమె ఈ అవార్డు తీసుకున్నారు. ఉత్తమ అవార్డు పొందిన సూపర్‌వైజర్ అనురాధని సీడీపీఓ వినుతశ్రీ దుశ్శాలువాలతో సన్మానించారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం


మాట్లాడుతున్న ఎంపీపీ లత, సమావేశానికి హాజరైన ప్రజా ప్రతినిధులు

కార్వేటినగరం: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు పని చేయాలని ఎంపీపీ లత అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ భవనంలో ఎంపీడీఓ చంద్రమౌళి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీపీ లత మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధి చెందేలా అధికారులు ప్రణాళికలు రూపొందించాలన్నారు. వేసవిలో నీటి ఎద్దడి లేకుండా ఎప్పటికప్పుడు తాగునీటి మోటార్ల మరమ్మతులు చేయించాలని సూచించారు. కత్తెరపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ భువనేశ్వరి పీహెచ్‌సీ అటెండర్‌పై దుండగులు దాడి చేశారని, పీహెచ్‌సీ విధులు నిర్వహించే సిబ్బందికి రక్షణ లేకుండా పోయిందని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. జాండ్లపేట–పచ్చికాపల్లం నడిచే బస్సు సర్వీసు రావడం లేదని విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్ శేఖర్‌రెడ్డి చెప్పారు. దీంతో ఆర్టీ అధికారులతో మాట్లాడి వెంటనే బస్సు సర్వీసు పునరుద్ధించాలని ఆదేశించారు. సర్వేయర్‌ను నియమించాలని మేజర్ పంచాయతీ సర్పంచ్ ధనుంజయవర్మ డిమాండ్ చేశారు. ఆర్కేవీబీపేట పంచాయతీలో లంచం లేనిదే రెవెన్యూ పనులు జరగడం లేదని సర్పంచ్ దివ్య సమావేశంలో వివరించారు. సీకాయపట్టెడ నుంచి కొల్లాగుంట గ్రామానికి వెళ్లే మార్గంలో 33 కేవీ లైన్లు చేతికి అందే విధంగా వేలాడుతున్నాయని కొల్లాగుంట ఎంపీటీసీ శ్రీనివాసులురెడ్డి వివరించారు. వీటిపై ఎంపీపీ లత మాట్లాడుతూ సమస్యలకు పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నిరంతర కృషితో ఉన్నత లక్ష్యాలు


పుత్తూరు: మహిళా హెచ్‌ఎంలను సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు


పుత్తూరు: కానిస్టేబుల్స్‌ను సన్మానిస్తున్న డీఎస్పీ రవికుమార్

పుత్తూరు: నిరంతర కృషితో అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చునని పుత్తూరు వాకర్స్ అసోసియేషన్ ఫౌండర్ ప్రెసిడెంట్ డాక్టర్ కె.శ్రీనివాసులురెడ్డి అన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా ప్రధానోపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ మహిళలు ఎన్నో కష్టానష్టాలను అనుభవిస్తూ ఇళ్లు చక్కదిద్దుకోవడం నుంచి ఉద్యోగాలు, వ్యాపారాలు తదితర రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. ప్రతి ఆడబిడ్డను విద్యావంతురాలిగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు తమవంతు పాత్ర పోషించాలన్నారు. సమాజం మనుగడ గురువుల చేతుల్లోనే ఉందన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న మహిళా పోలీస్ కానిస్టేబుల్స్‌ను డీఎస్పీ రవికుమార్ సన్మానించారు. కార్యక్రమంలో సీఐ సురేంద్రనాయుడు, ఎస్ఐ ఓబయ్య, వాకర్స్ అసోసియేషన్ నాయకులు మాధవులునాయుడు, గుణశేఖర్‌రెడ్డి, రఫీ, మునికృష్ణయ్య, కృష్ణమరాజు, ఆర్ముగం, గోపి, నారాయణ, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

యంగమ్మ మృతికి సంతాపం


సంతాపం తెలుపుతున్న వైఎస్ఆర్ సీపీ నాయకులు

విజయపురం: మండలంలోని పాతర్కాడు గ్రామం వైఎస్ఆర్ సీపీ యూత్ నాయకుడు సతీష్ నాన్నమ్మ యంగమ్మ(90) శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. మండల కన్వీనర్ శివరాజు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మృతదేహానికి పూలమాల వేసి, సంతాపం తెలిపారు.

అంకాళ పరమేశ్వరికి ప్రత్యేక పూజలు


విశేష అలంకరణలో అమ్మవారు

పాలసముద్రం: మండల కేంద్రంలోని దళితవాడలో వెలసిన శ్రీఅంకాళ పరమేశ్వరికి శనివారం వివిధ అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేపట్టారు. ఉదయం అమ్మవారిని వివిధ అభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ప్రతి ఇంటి నుంచి మహిళలు పాల బిందెలను పంబ వాయిద్యాలతో గ్రామాల్లో ఊరేగించి అమ్మవారికి పాలాభిషేకం చేశారు. సాయంత్రం అమ్మవారి పూల గరిగె ఊరేగింపు చేపట్టారు. సాయంత్రం అమ్మవారిని సుందరంగా అలంకరించి ప్రత్యేక దీపారాధనలు, పూజలు చేశారు. ఆదివారం అమ్మవారి ఎదుట శ్మశాన కొల్ల కార్యక్రమం నిర్వహించనున్నారు.

ఆలయంలో జనసేన పోస్టర్ ఆవిష్కరణ


సాయిబాబా ఆలయం గర్భగుడిలో జనసేన పోస్టర్ ఆవిష్కరణ

శ్రీరంగరాజపురం: మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో గంగాధర నెల్లూరు జనసేన ఇన్‌చార్జి యుగంధర్ పొన్న ఇతర నాయకులతో కలసి గర్భగుడిలో సమావేశం నిర్వహించారు. జనసేన పార్టీ 12వ ఆవిర్భావ పోస్టర్లను ఆలయం గర్భగుడిలో ఆవిష్కరించడంతో అక్కడికి వచ్చిన స్థానికులు, భక్తులు మండి పడుతున్నారు. రాజకీయ పార్టీలకు సంబంధించిన సమావేశాలు ఆలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు తదితర ప్రాంతాల్లో నిర్వహించకూడదనే నిబంధనలు ఉన్నా వ్యతిరేకంగా ప్రవర్తించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు చిరంజీవి, నాయకులు చార్లెస్, చందు, రాఘవ తదితరులు పాల్గొన్నారు.